


# నువ్వు నాదానవే!

కె.వి.యస్. నరసింహాశాస్త్రి

దాదాపు రచయితల సభల్లాంటివి స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాలు. ఎక్కడెక్కడో పని చేస్తున్న మిత్రులు కలుసుకొని సరదాగా ఒక వారం రోజులు గడపవచ్చు. కొత్తగా మిత్రులు కావడానికి అవకాశమూ ఉంది.

నాకు తెలుగు పండిట్‌గా ఉద్యోగం వచ్చిన రెండేళ్ళకు స్పాట్ వాల్యుయేషన్ అవకాశం వచ్చింది. వారం రోజులు పని చేస్తే రెండు వందలు పైగా వస్తుంది, కనుక కొందరు ప్రయత్నించి వాళ్ళని వీళ్ళని పట్టుకుని ఆ పేపర్లు దిద్దే అవకాశాన్ని సంపాదించుకుంటారు. నా కలాంటివేమీ లేకుండానే దానంతటదే వచ్చింది.

పెళ్ళాం, పిల్లల బాదరబందీ లేని బ్రహ్మచారిని అవటంతో ఒకరోజు ముందుగా వచ్చి, చిన్న లాడ్జిలో దిగాను.

మొదటి రోజు ఉత్సాహంలో రెండు వందల పేపర్లు పైగా దిద్దేశాను.

రెండవ రోజున కూడా పేపర్లు దిద్దేసి అయిదింటికి బయట పడ్డాను. ఏదో ఆలోచించుకుంటూ నడుస్తున్నాను.

“తలొంచుకుని నడిచే జబ్బు ఇంకా పోలేదా మహానుభావా” అన్న పరిచిత కంఠం విని ఠక్కున వెనక్కి తిరిగాను.

శకుంతల!

నేను మరచిపోగలనా ఈ అందాల పూరెమ్మను!

కలిసి చదువుకున్నాం ఆగిరిపల్లి పాఠశాలలో, భాషాప్రవీణ చదివిన అయిదేళ్ళూ ఎంతో సన్నిహితంగా మెలిగాం.

శకుంతలలో పెద్ద మార్పేమీ కనిపించలేదు. అప్పటిలాగే—ప్రబంధ కన్యలాగే ఉంది. మెళ్ళో ఏదో గొలుసులా ఉందే, కన్య అవునో కాదో?

“ఏమిటలా చూస్తున్నావు, శకుంతలని గుర్తు పట్టలేని దుష్యంతుడిలా ఏమిటా పోజు?. . .”

ఏమి టంది? దుష్యంతుడినా? నాకంత అదృష్టమా?

“ఏ లోకాన ఉన్నా, ఈ లోకానికి వచ్చేసెయ్... అర్జెంటుగా మనం చాలా మాట్లాడుకోవాలి ” అంది శకుంతల నవ్వుతూ


“చాలా ఏళ్ళ తర్వాత అనుకోకుండా నిన్ను చూడగలిగిన ఆనందంలో నా నోట మాట రావటం లేదు. నువ్వు ఈ జిల్లా పరిషత్‌లోనే పని చేస్తున్నావన్న మాట.” అడిగాను నేను.

“అవును గాని, ముందు హోటల్‌కు వెళ్ళి కాస్త ఏమన్నా తిందాం పద” అంది శకుంతల.

కొంత దూరం నడిచి, అక్కడున్న ఒక హోటల్ లోకి వెళ్ళాం.

సర్వరొస్తే ఏదో చెప్పి పంపింది శకుంతల.

“సరే కాని, ఈ వూళ్ళో ఎక్కడ దిగావ్”




"ఇలా రా" అంది.

వెళ్ళాను.

"నువ్వు కూడా ఇక్కడే పడుకో."

"... ... ..."

"నీకేం భయంలేదులే. విఘ్నం చెయ్యను. నీ సాన్నిధ్యంలో మైమరిచి నిద్రించే అదృష్టం నాకు దక్కాలి."

కాదనలేక పోయాను. పైగా శకుంతల చేయి పట్టి లాగింది. ఒక్క ఉదుటున, ఎంత ఆపుకున్నా శకుంతల మీద వెళ్ళి పడ్డాను. శకుంతల నాకు మెత్తగా తగిలింది. అదో మెరుపు లాంటి క్షణం. మహత్తర అనుభవం. గభాలున లేచి పక్కన శకుంతలకి తగిలకుండా పడుకున్నాను.

"నువ్వు వినాలే కాని, నా చరిత్ర అంతా ఇప్పుడు చెబుతాను. నువ్వు నాకు మంచి మిత్రుడిగా మిగిలి పోవాలి. ఇది విన్న తర్వాత కూడా, ఆ పైన నా అదృష్టం."

శకుంతల 'అదృష్టం' అన్న మాటని పదే పదే వాడుతోంది. ఇంతదాకా తను దురదృష్టవంతురాలా? ఏమో? తనే చెప్తుందిగా!

"ఆ రాత్రి అకస్మాత్తుగా వెళ్ళిపోయాను. అలా వెళ్ళిపోతానని నాకు తెలుసు. నువ్వు బాధపడతావని చెప్పలేదు. శాకుంతలం లోని శకుంతలకు, నాకు పోలికలున్నాయి. వాళ్ళ తొందరపాటుకి ఫలితంగా నాకు జన్మ నివ్వవలసి వచ్చిన తల్లిదండ్రులిద్దరూ నన్ను వదిలేశారు. ఆతర్వాత నన్ను పిల్లలూ, పెళ్ళామూ లేని ఒకాయన పెంచాడు. ఆయన్ని కణ్వుడను కుందాం. ఆ కణ్వుడు బాగా ఉన్నవాడు. నన్ను చదివించాడు. చదువయ్యాక ఆయన దగ్గరికే వెళ్ళాను. చిన్న కారుతో వచ్చి తీసుకు వెళ్ళింది ఆయనే. అక్కడికి వెళ్ళిన వారం రోజుల తర్వాత ఆ కణ్వుడు మద్యం మత్తులో నన్ను కబళించబోయాడు. పుణ్యభూమి కదూ మనది!

ఆ రాత్రికి రాత్రే అక్కడ నుంచి పారిపోయాను. వారం రోజులు ఒక చోట ఉండకుండా తిరిగాను. రైల్లో ఒక ఛోటా నాయకుడు నన్ను చూసి ( నా అందాన్ని చూసి అని తర్వాత తెలిసింది ) నా వివరాలు అడిగాడు. తనతో వస్తే నెల్లూరు జిల్లాలోని ఒక సమితిలో ఉద్యోగం ఇప్పిస్తానన్నాడు. అలాగే ఇప్పించాడు. ప్రతిఫలంగా ఏమిప్పిస్తావన్నాడు. నా దగ్గ రేముంది అన్నాను. నీ దగ్గర ఉన్నదే ఇవ్వు అన్నాడు. ఆ పైన నేను ఇవ్వకుండానే చాలాసార్లు తీసుకున్నాడు. నేను పనిచేస్తున్న వూళ్ళో మంచి భవంతిలో ఉంచాడు. అక్కడ అతనికి చాలా పలుకు బడి ఉంది. చుట్టుప్రక్కల గ్రామాల్లో ఆ ఛోటా నాయకుణ్ణి మహారాజులాగా చూసేవాళ్ళు అమాయక ప్రజలంతా. అతని మాటకి, చేతికి ఎదురులేదు. ఆర్నెల్ల తర్వాత అతనికి ఉద్యోగం కావల్సిన మరో అమ్మాయి తటస్థించింది. నా దగ్గరకు రావటం మానేశాడు. అలా చాలా మందికి ఉద్యోగాలిప్పించి, తన క్కావలసింది ఒలుచుకుని వదిలేశాడని తెలిసింది. ఇక అక్కడ ఉండటానికి మనస్కరించలేదు. అతను ప్రాణసమాన మంగళదాన్ని హరించినా, బ్రతుకు తెరువు ఇచ్చాడు కదా!

నేను సమితి నుండి జిల్లాకు మార్పించుకున్నాను. తర్వాత మూడేళ్ళకు ఇక్కడ నుంచి ఒకాయన అక్కడికి వెళ్ళటానికి ఎదురు చూస్తున్నాడని తెలియడంతో, నేను ఈ జిల్లాకు వచ్చాను. నా గతాన్ని మరచిపోయాను. నన్ను నేను మరిచిపోయి బ్రతికేస్తున్నాను. నిన్ను చూశాక అంతా జ్ఞాపకం వస్తోంది. ఇదీ నా చరిత్ర."

అప్పటిదాకా నా వంక చూడకుండా ఏక బిగిన చెప్పిన శకుంతల నా వైపు చూసింది. శకుంతల కళ్ళల్లో నీళ్ళున్నాయి. చలించిపోయాను. మౌనంగా ఆ నీటిని తుడిచేశాను.

"నా కన్నీటిని తుడవ గలిగిన వాడివి నువ్వే! నాకు తెలుసు నువ్వే" అంటూ నన్ను గట్టిగా కౌగలించుకుంది శకుంతల.

అంతా నిశ్శబ్దం!

పరిశీలనగా ఆలకిస్తే, వేగంగా కొట్టుకుంటున్న నా గుండెల సవ్వడి వినిపిస్తోంది.

* * *

ఏమీ ఎరగనట్లే మామూలుగా రోజులు దొర్లాయి. అతి మామూలుగా నిత్య కృత్యాలు సాగుతున్నాయి. నేను, శకుంతల స్నేహ మాధుర్యాన్ని చవి చూస్తున్నాం.

ఒక సారి నా పెళ్ళి గురించి అడిగింది శకుంతల.

ఉద్యోగం రాక ముందు చిల్లిగవ్వ క్కూడా కొరగాని నాకు ఇప్పుడు వేలం మీద విలువ ఉంది. నాకు అమ్ముడు పోవడం ఇష్టంలేదు. నా దృష్టిలో కట్నం తీసుకోవటం హీనాతిహీనం. పెళ్ళి చేసుకోవాలని ఇప్పుడిప్పుడే అనిపిస్తోందని శకుంతలకి చెప్పాను.

శకుంతల మౌనంగా వింది.

ఆ రాత్రి ... ఆ హోటల్లో ఆఖరి రాత్రి...నేను పనిచేస్తున్న వూరు వస్తానంది శకుంతల.

ఈ అందుదు రోజుల్లోనూ నాలో రూపు దిద్దుకున్న ఆలోచనను శకుంతలకు చెప్పాను. 'సరే' నంది.

చాలాసేపు మాట్లాడుకుని, ఏవేవో ఆలోచించుకుని నిద్రపోయాం.

తిరిగి నేను నిద్రలేచేసరికి పక్కన శకుంతల లేదు. శకుంతల కోరికపై క్రితం రోజు కొన్న తాజ్‌మహల్ బొమ్మ టేబుల్ మీద లేదు. శకుంతల బ్యాగ్ లేదు. శకుంతల వెళ్ళిపోయిందా? తనేమైనట్టు?

టేబుల్ మీద ఏదో కాగితం కనిపిస్తే గబగబా చదవసాగాను.

"నువ్వు నన్ను పెళ్ళిచేసుకుంటానని చెప్పినప్పుడు ఎంతో పొంగిపోయాను. మనుష్యుల్ని మనసులతోనే చూడగల నీ ఔన్నత్యానికి నివాళు లర్పిస్తూ, నీదాన్ని కావాలని ఆరాట పడ్డాను. అయితే నీ జీవన సహచరిగా మసలగలిగే ధైర్యం నాకు లేకపోయింది. ఇప్పటి నా ఆలోచన ఇది. నీకు చెప్పకుండానే వెళ్ళిపోతున్నాను. నువ్వు కొనిపెట్టిన తాజ్‌మహల్ బొమ్మ నాతో తీసుకెడుతున్నాను. నీ మంచితనాన్ని నేను పొందటం స్వార్థం అనిపించి, నీకు తగనని భావించుకుంటూ ఇలా చేస్తున్నాను. నన్ను క్షమించగలవని నాకు తెలుసు.

—శకుంతల."

వెంటనే ఆ కాగితాన్ని నలిపేసి కిటికీగుండా విసిరేశాను.

సామాను సర్దుక్కుని కిందకు దిగి వచ్చాను.

కౌంటర్‌లో బిల్లు చెల్లించాను.

"మీ మిసెస్ నాలుగింటికే వెళ్ళిపోయారే" అడిగాడు రిసెప్షనిస్టు.

అవును, శకుంతల నా మిసెస్సే, మిస్ కాకూడని మిసెస్!!

"అర్జంటు పని ఉండి వెళ్ళిపోయింది." చెప్పాను నేను, ఏమాత్రం తడబడకుండా.

బస్టాండుకు వచ్చి శకుంతల పనిచేస్తున్న వూరు వెళ్ళే బస్సు ఎక్కి కూర్చున్నాను.

బస్సు బయల్దేరింది. *